## సాధారణ కాలం – 6వ ఆదివారం (సంవత్సరం A)

*సిరాక్ 15:15–20; 1 కొరింథీయులకు 2:6–10; మత్తయి 5:17–37*

### పరిచయం (INTRODUCTION)

"స్వేచ్ఛ" అనే మాట మనకు ఆజ్ఞల గురించి ఆలోచించినప్పుడు మొదట గుర్తుకు వచ్చే మాట కాదేమో. చాలా సార్లు నియమాలు, చట్టాలు, నిషేధాలు మనలను కట్టడి చేస్తున్నట్లుగా అనిపిస్తాయి. కానీ ఈరోజు సువార్తలో యేసు కొండమీద ప్రసంగాన్ని కొనసాగిస్తూ అనేక ఆజ్ఞలను మన ముందుకు తీసుకువస్తున్నాడు.

అయితే ఈ అన్నింటి హృదయంలో ఉన్నది ఎక్కువ నీతి. అది భయంతో, కట్టుబాటుగా నియమాలను పాటించడం కాదు; పునీత ఆగస్టిన్ చెప్పినట్లుగా— దేవుడు కచ్చితంగా అడిగిన దానికంటే ఎక్కువ ప్రేమతో మరింత చేయడం. నిజంగా సహాయపడేదాన్ని చేయడం—నన్ను సహాయపడేది, ప్రతిరోజూ నేను కలుసుకునే వారిని సహాయపడేది.

### ప్రసంగం

– "జీవితాన్ని నడిపించే ధర్మశాస్త్రం"

ప్రారంభ కథ –

బాలుడు మరియు నియమాలు

చాలా సంవత్సరాల క్రితం, ఒక స్నేహితుడు తన చిన్ననాటి కథను నాకు చెప్పాడు.

అతను ఇలా అన్నాడు: "నేను చిన్నవాడిగా ఉన్నప్పుడు, మా అమ్మ ప్రతిదానికి నియమాలు పెట్టేది.
స్టవ్‌ను తాకకూడదు.

రోడ్డుపై పరుగెత్తకూడదు.
చిన్న చెల్లెల్ని ఎగతాళి చేయకూడదు.

ఒకరోజు నేను ఆమెను అడిగాను: 'అమ్మా, నీకు ఇన్ని నియమాలు ఎందుకు? మిగతా పిల్లల అమ్మలకి లేవే!'
ఆమె కిందకు వంగి, నా కళ్లలోకి నేరుగా చూసి ఇలా చెప్పింది:
'నిన్ను గాయపడనివ్వకుండా కాపాడటానికి నేను నిన్ను ఎంతో ప్రేమిస్తున్నాను కాబట్టి.'"

చాలా సంవత్సరాల తర్వాతే అతనికి అర్థమైంది: ఆ నియమాలు నియంత్రణ కోసం కాదు—రక్షణ కోసం, గౌరవం కోసం, ప్రేమ కోసం.

ఈరోజు సువార్త మనలను తీసుకెళ్లాలనుకునే స్థలం ఇదే.

## 1. మతం చిన్నచిన్న నియమాలుగా అనిపించినప్పుడు

నిజాయితీగా మాట్లాడుకుందాం. కొన్ని సందర్భాల్లో సంఘం నైతిక బోధలతోనే మిగిలిపోయినట్లుగా పేరొందింది. విశ్వాసం అంటే "ఇది చేయొద్దు... అది చేయొద్దు..." అనే పొడవైన జాబితాలాగా అనిపించవచ్చు. పైగా ఈరోజు సువార్తలో యేసు చెప్పిన మాట—"మీ నీతి శాస్త్రులకన్నా, పరిసయ్యులకన్నా ఎక్కువగా ఉండాలి"—అనగానే ఊపిరాడనట్లుగా అనిపించవచ్చు.

కానీ యేసు చెడ్డవారిని విమర్శించడం లేదు.
ఆయన, చట్టాన్ని అతి సూక్ష్మంగా పాటించడంలో నిపుణులైన వారితో తన శిష్యులను పోల్చుతున్నాడు. ఇక్కడే ప్రమాదం ఉంది: నియమాలను తీవ్ర స్థాయికి తీసుకెళ్తే, మనుషులు ఆందోళన చెందుతారు, అతిశ్రద్ధతో బాధపడతారు, లేదా తాము నీతిమంతులమనే గర్వంతో నిండిపోతారు.

అయితే యేసు కోరేది ఏమిటి?
ఇంకా ఎక్కువ నియమాలా? కాదు.
ఇంకా లోతైన హృదయం.

## 2. ఆజ్ఞల అసలు అర్థం ఏమిటి?

మనము వెనక్కి ఒక అడుగు వేసి ఇలా అడగాలి:
దేవుడు ఆజ్ఞలను ఎందుకు ఇస్తాడు?

పాత నిబంధన నుండి యేసు వరకు, ఆజ్ఞలకు రెండు ముఖ్యమైన ఉద్దేశ్యాలు ఉన్నాయి:

మొదటిది:

సమాజ జీవనాన్ని రక్షించడం.
అవి అస్తవ్యస్తతను, అన్యాయాన్ని, హానిని అడ్డుకుంటాయి.

రెండవది:

దేవుని స్వరూపాన్ని వెల్లడించడం.
ఆయన హృదయాన్ని చూపించడం—
ప్రతి మనిషిని విలువైనవాడిగా చూసే దేవుడు,
వారి గౌరవాన్ని కాపాడే దేవుడు,
తీవ్రంగా ప్రేమించే దేవుడు.

“స్టవ్‌ను తాకొద్దు” అనే తల్లి మాట అధికారం కోసం కాదు—ప్రేమ కోసం.
దేవుని ఆజ్ఞలు కూడా అలాగే.

మనం వాటిని మన అంతరంగంలో స్వీకరించినప్పుడు, దేవుని కళ్లతో చూడడం నేర్చుకుంటాము.

## 3. యేసు ధర్మశాస్త్రాన్ని పదును పెడతాడు

**—మనపై భారంగా పెట్టడానికి కాదు, మనలను స్వేచ్ఛగా చేయడానికి**

**యేసు "మీరు విన్నారు..., కానీ నేను మీతో చెబుతున్నాను..." అని చెప్పినప్పుడు, ఆయన ధర్మశాస్త్రాన్ని రద్దు చేయడం లేదు; దాని హృదయానికి మనలను తీసుకెళ్తున్నాడు.**

**పరిసయ్యుల సమస్య అవిధేయత కాదు—బాహ్య విధేయత. వారు అక్షరాన్ని పాటించి, మనిషిని విస్మరించేవారు.**

**అందుకే యేసు లోతుకు వెళ్తాడు:**

- **"హత్య చేయకూడదు" అని మాత్రమే కాదు, "నీ మాటలతో గాయపరచకూడదు."**
- **"వ్యభిచారం చేయకూడదు" అని మాత్రమే కాదు, "అవిశ్వాసం మొదలయ్యే హృదయాన్ని కాపాడాలి."**
- **"ప్రమాణం మీద సత్యం చెప్పాలి" అని మాత్రమే కాదు, "నీ అవును ఎల్లప్పుడూ అవునుగానే ఉండాలి."**

**ఆయన భయంతో కూడిన కంచె కట్టడం లేదు—స్వేచ్ఛకు దారి తెరవడం చేస్తున్నాడు.**

**చిన్న సంఘటన – నూతన సన్యాసి అయిన మరియు సన్యాసి అయిన పెద్ద గురువు**

**మెల్క్ అబ్బేలోని ఒక పదవీ విరమణ చేసిన అభాట్, తన నూతన సన్యాసి  గురించి చెప్పాడు.**
**ఆయన ఆశ్రమంలోని కొన్ని చిరాకు కలిగించే ఆచారాల గురించి తన ఆధ్యాత్మిక గురువుకు ఫిర్యాదు చేశాడు.**

ఆ గురువు సాదాసీదాగా ఇలా అన్నాడు:
“అయితే దాన్ని వేరేలా చేయి.”

అర్థం ఏమిటంటే: కనీస ప్రమాణాలతో విశ్వాసాన్ని జీవించకూ. మారిన హృదయంతో జీవించు.

యేసు సందేశం ఇదే:
“పాపం కాకుండా నేను ఎంతవరకు వెళ్లగలను?” అని అడగకు.
“ప్రేమ ఎంతవరకు వెళ్లగలదు?” అని అడుగు.

ఇక్కడే ఆజ్ఞలు చిగురిస్తాయి

## 4. సువార్త – మన జీవిత నిర్మాణాన్ని పరీక్షించే పరీక్ష

**నా స్నేహితుడు** 15వ శతాబ్దానికి చెందిన పాత ఇంట్లో నివసిస్తున్నాడు. ఇటీవల ఆ

ఇంటికి సంపూర్ణ నిర్మాణ పరీక్ష జరిగింది. నేలలు తెరచారు, కడ్డీలు బయటపడ్డాయి, ప్రతి చీలికను కొలిచారు. అది అలసట కలిగించేది—కానీ అవసరం.

ఈరోజు సువార్త మన శిష్యత్వానికి అలాంటి నిర్మాణ పరీక్ష.

యేసు అడుగుతున్నాడు:
“నీ జీవితాన్ని కలిపి ఉంచేది ఏమిటి?”

మనందరికీ కొన్ని క్షణాలు తెలుసు—నిర్మాణం ఊగిపోయినట్లు అనిపించే క్షణాలు:
• విరిగిన సంబంధం
• కుటుంబంలో అనారోగ్యం
• ఉద్యోగం కోల్పోవడం
• విఫలమయ్యాననే భావన

• పిలుపు గురించి అనిశ్చితి
• మోయలేనంత భారమని అనిపించే బాధ

ఈ క్షణాల్లో ఆజ్ఞలు మనలను నలిపేందుకు కాదు, మనలను నిలబెట్టేందుకు ఉన్నాయి—పాత ఇంటి కడ్డీల్లా. అవి మనలను బంధించవు; మద్దతిస్తాయి.

## 5. యేసు మనలను ఆశ్చర్యపరచాలనుకుంటాడు—అందరం ఒకే స్థాయిలో నిలబడేందుకు

స్పష్టంగా చెప్పాలి: ఈరోజు యేసు మాటలు భారంగా అనిపిస్తాయి. పరిసయ్యులే వీటన్నిటిని సంపూర్ణంగా నెరవేర్చలేకపోయారు.

కానీ ఇక్కడే రహస్యం ఉంది:
యేసు ఇలా తీవ్రంగా మాట్లాడటం ద్వారా అందరినీ ఒకే నేలపై నిలబెడతాడు.

ఎవరికీ గొప్ప చెప్పుకునే అవకాశం లేదు.
ఎవరూ "నేను చాలానే చేశాను" అని చెప్పలేరు.

మనందరికీ కృప అవసరం.
మనందరికీ ఆయన ఆత్మ అవసరం.

ధర్మశాస్త్రం దారిని చూపుతుంది.
ప్రేమ ఆ దారిలో నడిచే శక్తిని ఇస్తుంది.

లక్ష్యం అక్కడే నిలబడటం కాదు—ముందుకు సాగడం.

చిన్న సంఘటన

– హింస మొదలయ్యే దాగిన స్థలం

ఒక ఉపాధ్యాయురాలు తన తరగతిలోని ఒక చిన్న అబ్బాయి మరో పిల్లవాడిని పదేపదే అవమానిస్తున్నాడని చెప్పింది. మందలించగా అతను అన్నాడు: “అది కేవలం జోక్ మాత్రమే!”

కానీ ఆ పిల్లవాడు ప్రతిరోజూ ఇంటికి ఏడుస్తూ వెళ్లేవాడు.

ఆ ఉపాధ్యాయురాలు ఇలా చెప్పింది:
“చూస్తున్నావా? హింస గుద్దులతో కాదు—ముందే మొదలవుతుంది.”

యేసు కూడా ఇదే చెబుతున్నాడు: తప్పు కనిపించే ముందు నుంచే మొదలవుతుంది.
మాటలు నలిపేస్తాయి.
చూపులు గాయపరుస్తాయి.
పట్టించుకోని చిన్న చిన్న**విషయాలు** విషంగా మారుతాయి.

అందుకే యేసు, బలిపీఠానికి రావడానికి ముందే సమన్వయానికి పిలుస్తున్నాడు.

## 6. యేసు విశ్వాసపూర్వక యూదుడే

—ప్రేమ ద్వారా ధర్మశాస్త్రాన్ని నెరవేర్చాడు

కొన్ని సార్లు యేసును పాత నిబంధనను తేలికగా తీసుకున్నవాడిగా, లేదా డిమాండ్లు లేని “మంచి దేవుడు” మాత్రమే బోధించినవాడిగా ఊహిస్తారు. కానీ యేసు మోషే ధర్మశాస్త్రాన్ని గౌరవించిన విశ్వాసపూర్వక యూదుడు.

ఆయనను హానికరం లేని ప్రతీకగా మార్చే ప్రయత్నాలను, లేదా విశ్వాసంలోని కష్టమైన భాగాలను విస్మరించడానికి కారణంగా ఉపయోగించే ప్రయత్నాలను ఆయన అంగీకరించలేదు.

ఆయన ధర్మశాస్త్రాన్ని పదును పెట్టాడు—గూఢచర్యం కోసం కాదు, వ్యక్తిగత బాధ్యతను మేల్కొల్పడానికి:

- ప్రమాణం ఉన్నప్పుడే కాదు—ఎల్లప్పుడూ సత్యాన్ని అనుసరించాలి.
- సౌకర్యంగా ఉన్నప్పుడే కాదు—సమన్వయాన్ని వెతకాలి.
- చర్యలను మాత్రమే కాదు—హృదయాన్ని కాపాడాలి.
- హాని చేయకపోవడం మాత్రమే కాదు—ఇతరులను గౌరవించాలి.

ఇది సమాజం నన్ను గమనించడం కాదు.
ఇది యేసు నా అంతరాత్మపై నమ్మకం ఉంచడం.

ఇదే స్వేచ్ఛ.
ఇదే గౌరవం.

## 7. ఆజ్ఞలు గొలుసులు కాదు

**—ఆధారాలు**

మొదటి పఠనం మనకు గుర్తుచేస్తుంది:
దేవుడు మనలను ఎప్పుడూ ప్రలోభపెట్టడు.
ఆయన ఎల్లప్పుడూ జీవితానికి పిలుస్తాడు.

ఆజ్ఞలను అక్షరంగా కాకుండా ఆత్మతో జీవించినప్పుడు, అవి మనలను భూమికి ఉప్పుగా, లోకానికి వెలుగుగా మారేందుకు సహాయపడే ఆధారాలుగా మారతాయి.

అవి పంజరం కాదు.
అవి దిక్సూచి.

ప్రేమ వాటిని సంపూర్ణం చేసినప్పుడు, మన జీవితం మారుతుంది:
- పొరుగువారిపట్ల మన ప్రవర్తన మారుతుంది
- మనలను గాయపరచిన వారిపట్ల మన వైఖరి మారుతుంది

• క్షమ అవసరమైన చోట మన స్పందన మారుతుంది
• దేవునిపట్ల మన సంబంధం మారుతుంది

లేదా ఆ ఆధ్యాత్మిక గురువు మాటల్లో చెప్పాలంటే: “వేరేలా చేయి.”

## ముగింపు కథ – మరమ్మత్తు చేసిన గోడ

ఒకసారి ఒక నిర్మాణ కార్మికుడు, ఒక ఇంటిలో గోడలో లోతైన చీలికలు ఉన్నాయని గమనించాడు. యజమాని అన్నాడు: “పైన రంగు వేసేయండి.”

కానీ ఆ కార్మికుడు ఇలా అన్నాడు:
“పైన రంగు వేస్తే, చీలిక మళ్లీ వస్తుంది. గోడను తెరవాలి, పునాదిని బాగుచేయాలి, నిర్మాణాన్ని బలపరచాలి. అప్పుడు మాత్రమే అది సంపూర్ణమవుతుంది.”

సోదరులారా, సోదరీమణులారా, యేసు మన జీవితాలపై కేవలం రంగు వేయడు. ఆయన మనలను ఎంతో ప్రేమిస్తున్నాడు.

బలహీనమైనదాన్ని ఆయన తెరుస్తాడు,
విరిగినదాన్ని సరి చేసి అతికిస్తాడు
బలహీనమైనదాన్ని బలపరుస్తాడు,
తనంతట తానే నిలబడలేనిదాన్ని పునరుద్ధరిస్తాడు.

ఆయన ఆజ్ఞలు రంగు కాదు.
అవి పునాది.
ఆయన ప్రేమ బలం.
ఆయన ఆత్మ నిర్మాణకర్త.

మన జీవిత నిర్మాణాన్ని ఆయనకు అప్పగిద్దాం—అది బలంగా నిలబడటానికి, ఆయన వెలుగుతో ప్రకాశించటానికి. ఆమేన్.

**Translated by: Rev. Fr. Francis Theetla, Parish Priest of Paidikaluva, Cuddapah.**